వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్షయ తృతీయను పురస్కరించుకొని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష మల్లెల పూజను విశేషంగా ఆదివారం నిర్వహించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, తదితరాలను అందజేశారు. ఉభయకర్తలుగా శేషగిరిరావు దంపతులు వ్యవహరించారు. అర్చకుడు సాయిభరద్వాజ, ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో కొలువైన అనంత కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. భక్తులకు అన్నదానాన్ని జరిపారు. స్వామివారికి గరుడసేవ, తిరువీధి ఉత్సవాన్ని సాయంత్రం నిర్వహించారు. భరతనాట్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను భవానీ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఉభయకర్తలుగా రామయ్య, రాణి, చినపెంచలయ్య, సునీత, శ్రీనివాసులు, సుభాషిణి, వాసు, సంధ్య, నాగరాజు, లక్ష్మీప్రసన్న దంపతులు వ్యవహరించారు.

వేడుకగా చందనాలంకారం



నెల్లూరు(బృందావనం): అక్షయ తృతీయను పురస్కరించుకొని సంతపేటలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల రమాసహిత సత్యనారాయణ స్వామి మందిరంలో విశేషాభిషేకాలు, పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వైభవ్ ఆచార్య ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, తదితరాలను జరిపారు. సత్యనారాయణస్వామి, ఆంజనేయస్వామికి చందనాలంకారాన్ని నిర్వహించారు. సత్యనారాయణస్వామికి లక్ష మల్లెలార్చనను కనులపండువగా జరిపారు. ఉభయకర్తలుగా వెంకటలక్ష్మి, వెంకట సంజీవరావు, తదితరులు వ్యవహరించారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు ప్రవీణ్, రాఘవేంద్రస్వామి మఠ ప్రధానార్చకుడు రఘురామాచార్య, కంబలూరు వ్యాసపీఠ ప్రతిష్టాన కార్యనిర్వాహకుడు శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ సుధా రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు వెంకటసుబ్బారావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ముత్తుకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 359 మంది దరఖాస్తు చేసుకోగా, 313 మంది హాజరైనట్టు ప్రిన్సిపల్ సీహెచ్ సుజాత తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరిగిన జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు 262 మంది దరఖాస్తు చేసుకోగా, 212 మంది హాజరైనట్టు వెల్లడించారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలు జరిగాయి.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోవూరు విద్యార్థి సత్తా

కోవూరు: రాష్ట్రస్థాయి పదో జూనియర్ పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో కోవూరు డిగ్రీ కళాశాల విద్యార్థి జీ దుర్యోధన సత్తా చాటాడు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో శని, ఆదివారాల్లో జరిగిన పోటీల్లో 53 కేజీల విభాగంలో రాణించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మే 12 నుంచి 17వ తేదీ వరకు తమిళనాడులో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

గాయపడిన యువకుడి మృతి

పొదలకూరు : తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన మరుపూరు గిరిజన కాలనీకు చెందిన యాకశిరి సుబ్రహ్మణ్యం(17) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల19న సుబ్రహ్మణ్యం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత కుటుంబ సభ్యులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో తిరిగి జీజీహెచ్‌కు తీసుకొచ్చి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్సై కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పొదలకూరు : మండలంలోని పార్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం మోటార్‌బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి అదుపుతప్పి గేదెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..తిరుపతి జిల్లా గూడూరు మండలం మిట్టాత్మకూరు గ్రామానికి చెందిన మోపూరు మధుసూదన్‌రెడ్డి తన మామతో కలిసి పొదలకూరుకు మోటార్‌బైక్‌పై వస్తున్నాడు. పార్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి గేదెను ఢీకొనడంతో మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని బొల్లినేని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్కే కరిముల్లా తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లించకుండా మోసం చేయడంపై ఆదివారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఇనగలూరు వెంకటేశ్వర్లుకు బుచ్చిరెడ్డిపాళెం ప్రధాన కూడలి సమీపంలో కొంత స్థలం ఉంది. ఈ స్థలం గత కొంత కాలంగా వివాదంలో ఉంది. దీనిని అదునుగా చేసుకున్న బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి స్థలాన్ని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేస్తే వివాదం ముగుస్తుందని మాయమాటలు చెప్పి చేయించుకున్నాడు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తానన్న నగదు ఇవ్వకపోవడంతో బాలకృష్ణారెడ్డిని వెంకటేశ్వర్లు అడిగాడు. దీంతో నగదు ఎందుకు ఇవ్వాలని దౌర్జన్యం చేయడంతో పాటు దాడికి యత్నించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మైపాడు బీచ్‌లో సందర్శకుల సందడి

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరం చేరుకుని సేదతీరారు. రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకొన్న ముస్లింలు కుటుంబ సమేతంగా బీచ్‌కు చేరుకుని ఆహ్లాద వాతావరణంలో ఆనందంగా గడిపారు. దీంతో మైపాడు, నెల్లూరు ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది.

సమస్యల పరిష్కారంపై కార్యాచరణ



మాట్లాడుతున్న రమణారెడ్డి

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పింఛనర్ల సమస్యల పరిష్కార విషయంలో చేపట్టాల్సిన ఆందోళనలపై కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఏపీజీఈఏ జిల్లా సెక్రటేరియట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 30న నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు తరలి రావాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సహాధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానాన్ని కల్పించాలి



మాట్లాడుతున్న రఘురామ్

నెల్లూరు(వేదాయపాళెం): ముదిరాజ్ సామాజికవర్గానికి అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానాన్ని కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని తిరుపతినాయుడు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ మహాసభ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు రాష్ట్రంలో 23 లక్షల మంది ఉన్నారని, జనాభా నిష్పత్తిలో తమకు రావాల్సిన అవకాశాలను కల్పించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలుశ్రీనివాస్, నగరాధ్యక్షుడు చెంచయ్య, జిల్లా కార్యదర్శి వెంకటరమణయ్య, గోపాలయ్య, భాస్కర్, తిరుపాల్, శివకృష్ణ, రామ్మూర్తి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో..



జెడ్పీ హైస్కూల్లో..

నెల్లూరు (టౌన్): ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని పుస్తక పఠనంపై సుబేదారుపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సొసైటీ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, నెల్లూరు చాప్టర్.. పీఆర్ఆర్, వీఎస్ ప్రభుత్వ కళాశాల విడవలూరు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నెల్లూరు చాప్టర్ చైర్మన్ కిరణ్‌కుమార్, సెక్రటరీ విజయమహేష్, కోశాధికారి మస్తానయ్య, కమిటీ సలహాదారులు ప్రభాకర్, శేషయ్య, హాస్టల్ వార్డెన్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

• పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని డీఈఓ గంగాభవానీ పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు నాగభూషణం రచించిన బునియాద్ పుస్తకాన్ని డీఈఓకు అందజేశారు. పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, ఉపాధ్యాయులు కామేశ్వరరావు, మోహన్, వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్, రైతుబజార్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల పెన్నార్, బోడిగాడితోట ఫీడర్లలో విద్యుత్ లైన్లను నూతనంగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా సోమవారం ఉండదని టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడురోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో లక్ష్మీనరసింహపురం, రామాలయంవీధి, బారాషహీద్ దర్గా, ప్రగతినగర్, లేక్‌వ్యూకాలనీ, సుజాతమ్మకాలనీ, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఆరు నుంచి 10.30 వరకు సరఫరా ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

సంతపేటలో వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మెగా వైద్య శిబిరాన్ని నెల్లూరు ప్రైడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వైద్య పరీక్షలు చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్, శశిధర్, కోశాధికారి పార్థసారథి, పీఎంజేఎఫ్ రవి, ఎల్సీఐఎఫ్ కో ఆర్డినేటర్ కిషోర్, శరత్‌కుమార్, శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గ్రాడ్యుయేషన్ డే



నెల్లూరు (టౌన్): బీవీనగర్‌లోని రాజు కాంప్లెక్స్‌లో కేబీఆర్ లిటిల్ స్టార్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్లే క్లాస్, ఎల్కేజీ, యూకేజీ చిన్నారులు అలరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



నెల్లూరు(అర్బన్): దీనదయాళ్‌నగర్‌లో నిరుపేదలకు ఆహార పొట్లాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సూర్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమార్తెల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఆకాష్, కిరణ్, వంశీ, ధనుష్, ఆసిఫ్, శశి, కిరణ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల వద్ద పేదలకు ఆహార పొట్లాలను పాండురంగ అన్నదాన సమాజ ఉపాధ్యక్షుడు బాలాజీ, రూపాదేవి దంపతుల పంపిణీ చేశారు.

వైష్ణవిలక్ష్మిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక వసంత పరిమళ కొలాయి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు వైష్ణవిలక్ష్మి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు సుబ్బరామశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మి దంపతులు, సత్యనారాయణ, వ్యాసప్రసాద్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు, తదితరులు పర్యవేక్షించారు.

శేషవాహనంపై భగవద్రామానుజాచార్యులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాల్లో స్వామివారు శేషవాహనంపై ఆదివారం ఊరేగారు. మంగళశాసనోత్సవం, తిరుమంజనం, తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

శ్రీనివాసులుకు సన్మానం



నెల్లూరు(బృందావనం): టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా నియమితులైన పండితుడు శ్రీనివాసులును ఆదివారం సత్కరించారు. బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నెల్లూరు పద్యసార్వత్రిక పరిషత్, బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యనారాయణమూర్తి, కాంతారావు, సత్యనారాయణ, ప్రసాద్‌రావు, నాగజ్యోతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని మేయర్ స్రవంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు కార్పొరేషన్ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు హాజరుకానున్నారని చెప్పారు. కాగా సమావేశ కారణంగా డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు.

సోమిరెడ్డీ.. సర్వేపల్లిలో పోటీ చేసే సత్తా ఉందా..?



వెంకటాచలం: వరుస ఓటములతో ఉక్కిరిబిక్కిరవుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి పోటీచేసే సత్తా ఉందానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య ప్రశ్నించారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిరంతరం ప్రజల మధ్యే తిరుగుతూ వారి అభిమానాన్ని చూరగొంటున్నారని చెప్పారు. సీజనల్ పాలిటిక్స్ చేసే సోమిరెడ్డి ఈ విషయాన్ని జీర్ణించుకోలేక, ఇతర నియోజకవర్గాల నుంచి ఓటర్లను అద్దెకు తీసుకొచ్చి కండువాలు కప్పి సర్వేపల్లిలో టీడీపీలోకి వలసలంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఎర్రగుంటలో టీడీపీలో చేరిన వారిలో ముగ్గురు తప్ప మిగిలిన వారికి సర్వేపల్లి నియోజకవర్గంలో ఓటు హక్కు ఉందని నిరూపించాలని సవాల్ విసిరితే సోమిరెడ్డి స్వీకరించకుండా, ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా కూడా గెలవని చోటా నాయకులతో విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మస్తానయ్య, కసుమూరు సర్పంచ్ శివ, పార్టీ నేతలు నరసయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు భేష్



• కార్పొరేషన్‌కు పెరిగిన ఆదాయం

ఏడాది	వసూలైన మొత్తం
2021 - 22	రూ.61.55 కోట్లు
2022 - 23	రూ.79.46 కోట్లు
2023 - 24	
(ఇప్పటివరకు)	రూ.8 కోట్లు

నెల్లూరు(బారకాసు): పన్నుల వసూళ్లలో నెల్లూరు నగరపాలక సంస్థ దూకుడు పెంచింది. 2021 – 22తో పోలిస్తే 2022 – 23లో పన్నులు భారీగా వసూలయ్యాయి. ఇంటి పన్ను, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులపై వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించడంతో వసూళ్ల లక్ష్యం నెరవేరింది. నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉన్నాయి. ఇందులో గృహ, ప్రైవేట్ భవనాలు 1,27,562 ఉండగా, వీటి ద్వారా రూ.99.4 కోట్లు వసూలు కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ భవనాలు 393కు గానూ రూ.11.09 కోట్లు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన భవనాలు 36కు రూ.2.06 కోట్లు, ఖాళీ స్థలాల అసెస్‌మెంట్లు 5559కు రూ.14.22 కోట్లు వసూలవ్వాలి. కార్పొరేషన్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లలో 253 దుకాణాలకు గానూ 203 దుకాణాల నుంచి అద్దెల రూపంలో రూ.10.41 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇలా రూ.126.87 కోట్లకుపైగా మొత్తం నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంది.

ఇవీ వసూళ్లు..

2021 – 22 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్‌కు రూ.61.55 కోట్ల పన్నులు వసూలయ్యాయి. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.79.46 కోట్ల మేర చెల్లించారు. దీంతో రూ.17.91 కోట్ల మేర పన్నులు అదనంగా వసూలయ్యాయి. ఇదే స్ఫూర్తితో పన్నుల లక్ష్యాన్ని సాధించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.ఎనిమిది కోట్ల మేర పన్నులను వసూలు చేశారు. పన్నులను ముందస్తుగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ అవకాశాన్ని కల్పించడంతో చెల్లించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ నెలాఖరులోపు రూ.15 కోట్లు వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ.వంద కోట్లకు పెంచాలనేదే లక్ష్యం

నగరపాలక సంస్థకు రూ.100 కోట్ల మేర పన్నులను వసూలు చేయాలనేదే లక్ష్యం. ఇప్పటికే దాదాపు రూ.80 కోట్ల మేర వసూలయ్యాయి. మిగిలిన లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– చెన్నుడు, డిప్యూటీ కమిషనర్

సీఐటీయూ కార్యాలయానికి చిత్రపటం బహూకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఐటీయూ కార్యాలయానికి ఎన్నెఫ్పీఈ నేత రామసుబ్బారెడ్డి చిత్రపటాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడారు. తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన రామసుబ్బారెడ్డి చిత్రపటాన్ని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేయాలనే ఆశయం నెరవేరిందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నెఫ్పీఈ నేతలు పెంచలయ్య, శ్రీనివాసులు, శివ, నాగరాజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జైన మందిరంలో అక్షయ తృతీయ



నెల్లూరు(బృందావనం): అక్షయ తృతీయను పురస్కరించుకొని మండపాలవీధిలోని జైన మందిరం, శ్రేయాన్స్‌నాథ్ మందిరంలో మొదటి తీర్థంకరుడు రిషబ్‌దేవ్‌కు ప్రత్యేకాభిషేకాన్ని ఆదివారం నిర్వహించారు. కిషోర్ జైన్ ఆధ్వర్యంలో సంగీత మండలి భక్తబృందంతో భక్తిగీతాలను ఆలపించారు. సుమతి శ్రేయాన్స్ జైన్ థోల్, కిషోర్‌జైన్, భరత్‌జత్మల్ పర్యవేక్షించారు.

రేపట్నుంచి ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలను మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని పినాకినీ విద్యాపీఠ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటలక్ష్మీనరసింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శంకరభగవత్పాదుల వారికి పుష్పార్చనలు, ఆధ్యాత్మిక ప్రవచనలను రోజూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

• వైశాఖ శుక్ల పంచమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగమందిరం, అష్టలక్ష్మి మందిరాల్లో శంకరజయంతి, జయలక్ష్మి మాత ఆరాధనోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. లక్ష కుంకుమార్చన, సౌందర్యలహరి పారాయణం, సత్సంగాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



నెల్లూరు(బారకాసు): నగరంలోని దర్గామిట్ట, ప్రగతినగర్ మెయిన్‌రోడ్డులో మజ్జిగ చలివేంద్రాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు రమేష్‌రాజు, మునివెంకటసూర్య మాట్లాడారు. కార్యక్రమానికి సహకారాన్ని అందించిన ఏకేనగర్‌కు చెందిన రవీంద్రరెడ్డి, జ్యోతి దంపతులు, వారి కుమార్తె సింధూకు కృతజ్ఞతలను తెలియజేశారు.

పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటుకు వినతి



మాట్లాడుతున్న మున్నా

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా పేర్కొన్నారు. నగరంలోని రామకోటయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జనార్దన్‌రెడ్డి కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. పోలీస్ గస్తీని పెంచడంతో పాటు అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ఏఐవైఎఫ్ నేతలు సర్దార్, సుల్తాన్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.